క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్‌కు చేరిన పది ప్రశ్నపత్రాలు



పదవ తరగతి ప్రశ్నపత్రాలను బాక్సులలో భద్రపరుస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలు ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగ పోలీసుస్టేషన్‌కు చేరాయి. ఎస్‌ఐ విశ్వనాథనాయుడు పర్యవేక్షణలో పరీక్షల చీఫ్, సూపరింటెండెంట్లు రూపేష్‌కుమార్, గిరిజ, డిపార్ట్‌మెంట్ అధికారులు శ్రీనివాసులు, ఆదిశేషయ్య ఇనుప పెట్టెల్లో వాటిని భద్రపరచారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ ఏ, బీ, సెంటర్లలో మొత్తం 306 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలైన చల్లమాంబపురం, పల్లమాల, బీఎస్‌కండ్రిగ, నెలవాయి, ప్రైవేటు పాఠశాలలు శ్రీనివాసతేజ, ఎస్‌వీఆర్, అక్షర పాఠశాల విద్యార్థులు ఇక్కడ పరీక్షలకు హాజరవుతారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుదాం

నారాయణవనం: గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగడుతూ మరోసారి పార్టీని అధికారంలోకి తేవడమే లక్ష్యంగా అందరూ సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. ఆదివారం నారాయణవనంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన పార్టీ శ్రేణులతో మాట్లాడారు. తొలుత ఉదయం స్థానిక ధూండి వినాయక ఆలయ కుంభాభిషేకంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. మధ్యాహ్నం నారాయణవనం-3 ఎంపీటీసీ పార్వతీ శంకరయ్య మనువరాలి కేశఖండన కార్యక్రమంలో రాజేష్‌తో పాటు పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అన్నాదొరై, జిల్లా క్రియాశీల కార్యదర్శి రాకేష్ కిరణ్, సర్పంచులు సాయిరవి, నాగూరు, మురళి, వైస్ ఎంపీపీ శివశంకర్, ఎంపీటీసీ రవి, నాయకులు కేజీ రవి, పెరియదొరై, చిన్నదొరై, గురుస్వామి, దొరైరాజ్, తిరువేంగడం, గోవింస్వామి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న త్యాగరాజు, సర్పంచ్ జ్యోతి

వరదయ్యపాళెం: స్థానిక మేజర్ పంచాయతీలో మహిళా పారిశుద్ధ్య కార్మికులకు ఏపీ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ గుత్తి త్యాగరాజు చీరలను అందజేశారు. ఆదివారం పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి చేతుల వీటిని పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామ పరిశుభ్రతలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎనలేనివని, అందుకే వారికి సూళ్లూరుపేటకు చెందిన శ్రీ రామలింగ చౌడేశ్వరిదేవి మహిళా సేవా సంఘం గౌరవాధ్యక్షురాలు మన్నెముద్దు పద్మజ శ్రీనివాసులు దంపతుల జ్ఞాపకార్థం చీరలు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ ఉపసర్పంచ్ బొప్పన చంద్రబాబు, పంచాయతీ బిల్ కలెక్టర్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాథకు ఆసరా



ప్రథమ చికిత్స అనంతరం హాస్పిటల్‌కు తరలిస్తున్న దృశ్యం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): ఓ అనాథ దుస్థితిపై రేణిగుంట సర్పంచ్ చలించారు. వివరాలు..తిరుత్తణికి చెందిన వెంకటేష్(53) ఎవరూలేని అనాథ. కాళ్లకు దెబ్బతగిలి ఇన్‌ఫెక్షన్ అయ్యింది. నడవలేని స్థితిలో రేణిగుంట-పుత్తూరు రోడ్డు జ్యోతినగర్ నాగాలమ్మ ఆలయం వద్ద నాలుగు రోజులుగా అతను ఉంటున్నాడు. ఇది తెలుసుకున్న సర్పంచ్ నాగేషం ఆదివారం అతనికి ప్రథమ చికిత్స చేయించారు. కొత్త దుస్తులు తొడిగించి, 108లో తిరుపతి రుయాకు తరలించాడు. వార్డు సభ్యుడు ఇన్బనాథన్, పోలీస్ సిబ్బంది సహాయ సహకారాలు అందించారు.

గంగమ్మ ఆలయానికి విరాళం

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి తిరుపతికి చెందిన కుంటుమల్ల గౌతమ్ ఆదివారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని మబ్బు దేవనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఈఓ ఎ.జయకుమార్‌కు అందజేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

నేతన్నకు మొండిచేయి

చేనేత కార్మికులపై కూటమి ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ ప్రదర్శించింది. బడ్జెట్ కేటాయింపుల్లో కేవలం 0.043 శాతం కేటాయింపులు చేసి కపట ప్రేమ చూపింది. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా అన్యాయం చేసింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి చేనేతల వెన్నంటే తామున్నామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు వారి సంక్షేమానికి బడ్జెట్‌లో మాత్రం రూపాయి కూడా విదల్చకపోవడంతో నేత కార్మికులు మండిపడుతున్నారు.



వరదయ్యపాళెం మండలంలో మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు

- బడ్జెట్‌లో కేటాయింపులు శూన్యం
- చేనేతలకు పూర్వ వైభవం తెస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ
- అధికారంలోకి వచ్చాక రూపాయి కూడా విదల్చని వైనం
- మండిపడుతున్న కార్మికులు

వరదయ్యపాళెం: చేనేత మగ్గాలపై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా చేనేత ఉపవృత్తుల వారితో కలిపి సత్యవేడు నియోజకవర్గంలో 481 మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ చేనేత వర్గాలకు తీవ్ర నిరాశ కలిగించింది.

కేటాయింపులు నిల్

- చేనేతల ఆరోగ్య భద్రతను తన బాధ్యతగా స్వీకరిస్తున్నానని ప్రకటించి హెల్త్ ఇన్సూరెన్స్ పథకానికి రూ. 10కోట్లను చేనేత దినోత్సవం రోజున విజయవాడలో చంద్రబాబు ప్రకటించారు. కానీ బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు.
- చేనేతలపై పెనుభారంగా ఉన్న జీఎస్టీని రద్దు చేయించేందుకు కట్టుబడి ఉన్నామని, కేంద్రంతో చర్చిస్తామని చెప్పి చివరకు రిక్తహస్తం చూపారు.

గత ప్రభుత్వంలో మండలాల వారీగా నేతన్న నేస్తం లబ్ధిదారుల వివరాలు

మండలం	లబ్ధిదారుల సంఖ్య
బీఎన్‌కండ్రిగ	56
నాగలాపురం	13
నారాయణవనం	311
సత్యవేడు	17
వరదయ్యపాళెం	84

- హ్యాండ్‌లూమ్ పార్క్ ఏర్పాటు చేయించి చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు, వస్త్రాలకు మార్కెటింగ్ కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. తీరా బడ్జెట్‌లో ఆ ఊసే లేదు.
- నేతన్న నేస్తం పథకానికి గత ప్రభుత్వం కేటాయింపులు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం ఆ పథకం మాటే ఎత్తలేదు.
- నూలు సబ్సిడీ, స్థానిక మార్కెట్ అవకాశాలు పెంపొందించేందుకు వినియోగదారులకు వస్త్ర కొనుగోలుపై ఇచ్చే 20శాతం రిబేట్ ఊసేలేదు.

కలగానే చేనేత సహకార సంఘాల ఎన్నికలు

2018 నుంచి చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించడం లేదు. అఫిషియల్, పర్సనల్ ఇన్‌చార్జ్‌లతో నడిపిస్తున్నారు. ఎన్నికలు నిర్వహించేంత వరకు సంఘ సభ్యులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేసి కార్మికులకు ఇబ్బంది లేకుండా పని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు కోరుతున్నారు. చేనేతలకు నేరుగా లబ్ధి పొందే త్రిఫ్ట్ ఫండ్ పథకం, పరికరాల కొనుగోలు, నూలు సరఫరా సబ్సిడీ, ఉత్పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, చేనేతల రుణ మాఫీ, పావలా వడ్డీ చెల్లింపులకు ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో చర్చించి సవరణల ద్వారా కేటాయింపులు చేయాలని కోరుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

బడ్జెట్‌లో చేనేతలకు మొండిచేయి



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేతలకు మొండిచేయి చూపింది. ఇప్పటికే వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. బడ్జెట్‌లో కేటాయింపులు సక్రమంగా జరగలేదనే బాధ చేనేతల్లో నెలకొంది. ఎన్నికల ముందు చెప్పిన మాటలకు అధికారం వచ్చిన తర్వాత ప్రభుత్వ చర్యలకు పొంతన లేదు.

– రామలింగయ్య, మరదవాడ, వరదయ్యపాళెం మండలం

హెల్త్ ఇన్సూరెన్స్ ఊసే లేదు



హెల్త్ ఇన్సూరెన్స్ పథకం అమలుకు రూ.10కోట్లు ప్రకటించి కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం శోచనీయం. చేనేత సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని నమ్మబలికి బడ్జెట్‌లో ఆయా పథకాల ప్రస్తావన లేకపోవడం ఎంతమాత్రమూ సరికాదు. కార్మికులందరూ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

– గుత్తి కన్నయ్య, ఇందిరానగర్, వరదయ్యపాళెం మండలం

భక్తిప్రపత్తులతో విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠించిన శ్రీ మహాలక్ష్మమ్మ విగ్రహం

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పుత్తేరిలో నూతనంగా నిర్మించిన శ్రీమహాలక్ష్మమ్మ దేవాలయంలో ఆదివారం శ్రీ మహాలక్ష్మమ్మ విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. తొలుత అమ్మవారికి విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే దేవాలయంపై కలశాలకు పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం కుంభ స్థాపన, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు వీరయ్య, నాగార్జున, పుల్లయ్య, వెంకటయ్య, సుబ్బయ్య, రవి, నవీన్, ఆశోక్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలయంపై కలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు, గ్రామస్తులు

‘కిక్కు’ ఎనీ టైం గురూ..!



ఉదయం 7 గంటలకు తెరచుకున్న మద్యం షాపు

- నిబంధనలు బేఖాతర్
- అటు మద్యం షాపు..పక్కనే అధికార పర్మిట్ షాపు
- జోరుగా మద్యం విక్రయాలు
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ



అనధికార పర్మిట్ షాపులో మద్యం అమ్ముతున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక మెయిన్‌రోడ్డులో ఉన్న ఎస్‌ఎల్ మద్యం దుకాణం పక్కనే ఉన్న అనధికార పర్మిట్ షాపులో మద్యం విచ్చలవిడిగా అమ్ముతున్నారని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అనధికార పర్మిట్ షాపులో ఉదయం 5 గంటల నుంచి మద్యం విచ్చలవిడిగా అమ్ముతున్నారని, పైగా మద్యం షాపు పక్కనే బెల్టుషాపును నిర్వహించటంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రశాంతంగా ఉండే పల్లెల్లో గొడవలు జరుగుతున్నాయని, విచ్చలవిడి మద్యం అమ్మకాలను అడ్డుకోవలసిన ఎక్సైజ్ ఉన్నతాధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనుమానాలకు తావిస్తోందని చెబుతున్నారు. మరోవైపు నిబంధనల మేరకు ఉదయం 10 గంటలకు మద్యం షాపు తెరవలసిన ఉంది. అయితే ఆదివారం ఉదయం 7 గంటలకే తెరచి ఇష్టానుసారంగా మద్యం విక్రయిస్తున్నారు. అటు మద్యం షాపు, పక్కనే బెల్ట్‌షాపుతో మొత్తంగా కిక్కుతో బుచ్చినాయుడుకండ్రిగ ఊగుతోంది. సంబంధిత అధికారుల సహకారం లేనిదే ఇలా దర్జాగా నిర్వహిస్తారా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

యువత పోరుతో బాబు కళ్లు తెరిపిద్దాం

- సత్యవేడు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్



యువత పోరు పోస్టర్లను పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరిస్తున్న నూకతోటి రాజేష్

నారాయణవనం: ఈనెల 12న తిరుపతి కలెక్టరేట్ వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించ తలపెట్టిన యువత పోరుతో అధికారం కోసం ప్రజలను బురిడీ కొట్టించిన చంద్రబాబు కళ్లు తెరిపిద్దామని సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పిలుపునిచ్చారు. ఆదివారం నారాయణవనంలో పార్టీ నాయకులతో కలిసి యువత పోరు పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం రాజేష్ మీడియాతో మాట్లాడారు. సీఎంగా జగనన్న చేసిన సంక్షేమ పాలనను చంద్రబాబు ఎందుకు చేయలేకపోతున్నారని సూటిగా ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలోనూ ఆదాయ, రాబడులు తగ్గినా సంక్షేమాన్ని మాత్రం క్రమం తప్పకుండా ప్రకటించిన క్యాలెండర్ మేరకు అందజేసిన ఘనత జగనన్నకే దక్కిందని అన్నారు. ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో జత కట్టి, సూపర్ సిక్స్ పథకాల హామీలతో అధికారంలోకి వచ్చిన అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పుడా హామీలను నెరవేర్చకుండా జాప్యం చేస్తూ ప్రజలను నిండా వంచిస్తున్నారని విమర్శించారు. వాస్తవానికి పేదపిల్లల చదువుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకూడదని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు విద్యార్థుల చదువులు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అధికారంలోకి వచ్చింది మొదలు హామీలు నెరవేర్చడం చేతకాక ప్రతిదానికీ వైఎస్సార్ సీపీపైనే నెపం నెట్టేసే కార్యక్రమంతో బురద చల్లుతున్నారని నిప్పులు చెరిగారు. అప్పుల ఊబిలోకి రాష్ట్రం కూరుకుపోయిందని, ఆంధ్రప్రదేశ్ మరో శ్రీలంక అవుతుందంటూ చేసిన దుష్ప్రచారానికి తోడు ఎల్లో మీడియా అదే పనిగా బాకా ఊది బాబుసేవలో తరించాయని మండిపడ్డారు. తీరా మొన్నటికి మొన్న ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన రాష్ట్రం అప్పుల వివరాల్లో వైఎస్సార్ సీపీ పాలనలో చేసిన అప్పుల వాస్తవ సమాచారాన్ని వెల్లడించి, చంద్రబాబు ఉద్దేశపూర్వకంగా ప్రజలను ‘అప్పుల బూచి’తో తప్పుదోవ పట్టించారనేది ప్రజలకు చెప్పకనే చెప్పారన్నారు. పేద విద్యార్థుల కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో ఈ నెల 12వ తేదీ బుధవారం ఉదయం తిరుపతి కలెక్టరేట్ వద్ద యువత, విద్యార్థులతో నిర్వహించనున్న యువత పోరుకు నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి యువత, విద్యార్థులు, పార్టీ శ్రేణులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అన్నాదొరై, జిల్లా క్రియాశీల కార్యదర్శి రాకేష్ కిరణ్, సర్పంచ్‌లు సాయిరవి, మురళి, వైఎస్ ఎంపీపీ శివశంకర్, ఎంపీటీసీ రవి, నాయకులు గురుస్వామి, సుబ్రమణ్యం, అశోక్, తిరువేంగడం, రంగనాథం, మంజునాథ్, రామన్, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వేరుశనగ ఒబ్బిళ్లు



ఏర్పేడు మండలం బండారుపల్లె సమీపంలో వేరుశనగ ఒబ్బిడి పనుల్లో కూలీలు

ఏర్పేడు(రేణిగుంట): శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వేరుశనగ ఒబ్బిళ్లు జోరుగా సాగుతున్నాయి. రబీ సీజన్‌లో వరితోపాటు రైతులు వేరుశనగను అధికంగా సాగు చేశారు. మండలంలోని బండారుపల్లె, దుర్గిపేరి, మడిబాక, చింతలపాళెం, అముడూరు గ్రామాలలో వేరుశనగ పీకి కుప్పలేసి కూలీలు కాయలు పీకడంలో నిమగ్నమయ్యారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో టార్పాలిన్ పట్టలను కట్టుకుని వాటి నీడన పనులు చేస్తున్నారు.

తాగునీటికి కటకట..!

- ఎంఏ రాజులకండ్రిగ అరుంధతి వాడలో అవస్థలు పడుతున్న ప్రజలు



ఎంఏ రాజులకండ్రిగలో నీరు రాని చేతిపంపు వద్ద అవస్థలు పడుతున్న స్థానిక మహిళలు

వరదయ్యపాళెం: కేవీబీపురం మండలంలోని ఎంఏ రాజులకండ్రిగ అరుంధతివాడలో తాగునీటి కోసం స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం పంచాయతీ కొళాయిలకు సరఫరా అయ్యే బోరు మోటారు చెడిపోయింది. దీంతో ప్రత్యామ్నాయం లేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ పాలకులు బోరు మోటారుకు మరమ్మతులు చేయించకపోవడంతో ఈ పరిస్థితులు తలెత్తాయని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి మోటారును బాగు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

‘మరుగు’ కోసం పరుగు..!



రేణిగుంట బస్టాండ్‌లో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



- రేణిగుంట బస్టాండ్‌లో ప్రయాణికుల అవస్థలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట బస్టాండ్‌లోని మరుగుదొడ్లకు ఎప్పుడూ తాళం వేసి ఉండడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రకృతి పిలుపు వస్తే ‘మరుగు’ కోసం పరుగులు తీస్తున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్న బస్టాండు ఆవరణలో మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉంచడంతో ప్రధానంగా మహిళలు, వృద్ధులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఆర్టీసీ అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వంట పాత్రల వితరణ

తిరుపతి కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జీవకోనలో రీల్స్ సంస్థ నిర్వహిస్తున్న బాలికల వసతి గృహానికి ఆదివారం వంట పాత్రలు, స్టీల్ ప్లేట్లు, హాట్‌బాక్సులు, టవల్స్, నోట్‌బుక్స్, పెన్నులు, వంట సరుకులను వసతి గృహ నిర్వాహకుడు శాకం కృష్ణమూర్తికి అందజేసింది. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశం, మునికృష్ణ, రాధాకృష్ణ, రాజగోపాలాచారి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జోడు గుర్రాల స్వారీతో సతమతం

- రెండు మండలాలకు ఒక్కరే తహసీల్దార్
- పేరుకు పోతున్న సమస్యలు
- ప్రజలకు తప్పని అగచాట్లు



సత్యవేడు తహసీల్దార్ కార్యాలయం

వరదయ్యపాళెం: నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడు తహసీల్దార్ కార్యాలయం నెల రోజులుగా ఇన్‌చార్జ్ పాలనలో కొనసాగుతోంది. గత నెల సత్యవేడు తహసీల్దార్‌ను ఉన్నఫళాన బదిలీ చేశారు. అనంతరం వరదయ్యపాళెం తహసీల్దార్ రాజశేఖర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

కీలక సమయంలో ఇన్‌చార్జ్ పాలన

అయితే సత్యవేడు మండలంలో ప్రధానంగా శ్రీసిటీ సెజ్‌కు సంబంధించి రెండవ విడత భూసేకరణ కార్యక్రమం జరుగుతోంది. వారం రోజులుగా భూములు కోల్పోయే రైతులకు సంబంధించి పరిహారం ఇచ్చేందుకు రైతులతో అవార్డు ఎంక్వైరీ స్వయాన సూళ్లూరుపేట ఆర్డీఓ సమక్షంలో జరుగుతోంది. ఇలాంటి కీలక సమయంలో సత్యవేడు తహసీల్దార్ లేకపోవడం భూసేకరణ ప్రక్రియలో కొంతమేరకు జాప్యం చోటుచేసుకుంటోంది. ఓవైపు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించినా అదే సమయంలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ పోస్టు భర్తీ చేయాలనే ఆలోచన చేయకపోవడం గమనార్హం! అంతేకాక మండలంలో రోజూ వచ్చే అర్జీలు, ఇతర భూసమస్యలకు సంబంధించి పరిష్కారం కావడం లేదు. దీంతో మండలంలో సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అంతేకాక తహసీల్దార్ లేని సమయం చూసి గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. తక్షణమే స్పందించి తహసీల్దార్ పోస్టు భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రెండు మండలాల్లో పేరుకుపోతున్న రెవెన్యూ సమస్యలు

వరదయ్యపాళెం తహసీల్దార్ రెండు మండలాలకు అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తుండడంతో ఆయనకు జోడు గుర్రాల స్వారీ అయ్యింది. ఫలితంగా అటు వరదయ్యపాళెం, ఇటు సత్యవేడు మండలాల్లో వచ్చే రెవెన్యూ సమస్యలకు పరిష్కారం కరువైంది. తహసీల్దార్ పూర్తిగా భూసేకరణ ప్రక్రియలో నిమగ్నం కావాల్సి రావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. మ్యుటేషన్లు, సర్టిఫికెట్ల కోసం అర్జీదారులు రెండు కార్యాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఇకనైనా సత్యవేడుకు ఫుల్‌టైం తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.